క్లుప్తంగా

జాతీయ పతాకానికి సమానంగా టీడీపీ జెండా



జాతీయ జెండా పక్కనే టీడీపీ జెండా

గిద్దలూరు రూరల్: టీడీపీ కార్యకర్తల పిచ్చి పరాకాష్టకు చేరింది. త్రివర్ణ పతాకానికి సమానంగా ఏ జెండాను ఉంచరాదు. కానీ జాతీయ జెండా పక్కనే టీడీపీ జెండా కట్టి దాన్ని అవమానించేలా ఓ టీడీపీ కార్యకర్త ప్రవర్తించాడు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో గ్యాస్ వెల్డింగ్ యజమాని హనీఫ్ తన షాపునకు టీడీపీ జెండాతో పాటుగా జాతీయ జెండాను కట్టి ఉంచాడు. ఈ విషయమై జాతీయ జెండా పక్కన ఎటువంటి పార్టీ జెండాలు ఉండరాదని చెప్పడంతో అప్పుడు టీడీపీ జెండా అక్కడ నుంచి తొలగించాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థిని ప్రతిభ



షేక్ ఫర్హానా

మార్కాపురం: ఒంగోలులో జూలై 25న జిల్లా స్థాయిలో నిర్వహించిన భారత రాజ్యాంగం–కనీస అవగాహన అనే అంశంపై వక్తృత్వపు పోటీల్లో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని షేక్ ఫర్హానా ద్వితీయ స్థానం పొందిందని హెచ్‌ఎం శనివారం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒంగోలులో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఫర్హానాకు 5 వేల రూపాయల నగదు బహుమతి, ప్రశంసపత్రంతో సత్కరించారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కంభం నెహ్రూనగర్ లో పారిశుధ్య పనులు చేయిస్తున్న పోలీసులు

కంభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కంభం సీఐ కె.మల్లిఖార్జునరావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ కార్మికులతో కలసి పోలీసులు పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో చిల్లచెట్లను తొలగించిన అనంతరం నెహ్రూనగర్‌లో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చీపురు పట్టి శుభ్రపరిచిన సీఐ

గిద్దలూరు రూరల్: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్దమార్కెట్ సెంటర్, షాదీఖాన సెంటర్లల్లో శనివారం స్థానిక సీఐ కె.సురేష్ చీపురు పట్టి శుభ్రత–పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. వీధులను ఆయన తన సిబ్బందితో సహా చీపురుతో ఊడ్చి శుభ్రపరిచారు.

కనీస వేతన చట్టాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండారెడ్డి

గిద్దలూరు రూరల్: కార్మికులకు కనీస వేతనాల చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.వి.కొండారెడ్డి అన్నారు. సీఐటీయూ గిద్దలూరు మండల 8వ మహాసభ సందర్భంగా పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల చట్టాలను అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్, ప్రమాదబీమా తదితర చట్టపరమైన హక్కులను కార్మికులకు వర్తింపజేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, నరసింహులు, చంటయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఉచిత బస్సు పథకం

- అదనపు సర్వీసులు తిప్పాలంటున్న మహిళలు
- బస్‌ల్లో సీట్లు దొరక్క విసుగెత్తిపోతున్న మహిళలు



టికెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సత్యనారాయణ



బస్సును రిపేరు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



నిల్చునేందుకు కూడా ఖాళీ లేని బస్సులో మహిళల అవస్థలు

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు ఆశించిన మేర ఫలితాలు సాధించడం లేదు. క్షేత్రస్థాయిలో మహిళలకు అవసరమైనన్ని బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి ఉన్న బస్సుల్లో ప్రయాణం చేయాలంటే సీట్లు లేక తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఉన్న సర్వీసులతోనే ప్రయాణించాలంటే తమ గమ్యస్థానాలకు ఎప్పుడు చేరతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు తమ ఊర్లకు వెళ్లేందుకు బస్సులు ఎక్కినా నిండిపోవడంతో నిలబడేందుకు కూడా చోటు లేక దిగిపోతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, పొదిలి డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 34 గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో లేవు. వీరంతా ఉచిత బస్సును పొందాలంటే తమ గ్రామం నుంచి ఆటోలు, ఇతర రవాణామార్గాలతో మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండల కేంద్రాలకు చేరుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. శుక్రవారం సాయంత్రం పథకం ప్రారంభం కాగా మార్కాపురం డిపో పరిధిలో కేవలం 422 మంది మహిళలు మాత్రమే ఉచిత బస్సుల్లో ప్రయాణించారు. ఇదిలా ఉంటే పుణ్యక్షేత్రాలైన తిరుపతి, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తి, శ్రీశైలం వంటి ప్రాంతాలకు మహిళలకు ఉచితంగా వెళ్లాలంటే కష్టసాధ్యమే. ప్రభుత్వం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాత్రమే అనుమతించిందని, ఎక్కువ పుణ్యక్షేత్రాలకు అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి బస్సులు మాత్రమే ఉన్నాయి. వీటిలో ప్రయాణించాలంటే మహిళలు తప్పనిసరిగా టిక్కెట్ కొని వెళ్లాల్సిన పరిస్థితి. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల్లో ఇప్పటికీ స్పందన అంతంతమాత్రంగానే ఉంది. గ్రామీణ ప్రాంతాలకు కూడా అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి నడపాలని మహిళలు కోరుతున్నారు. ఇలా అయితేనే ఉచిత బస్సులో ప్రయాణం కొనసాగించవచ్చని, లేకుంటే ఆటోలకు చార్జీలు చెల్లించి ప్రధాన ప్రాంతాలకు వచ్చి బస్సు ఎక్కితే తమకు ఉపయోగం ఉండదంటూ గ్రామీణ ప్రాంత మహిళలు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం మహిళలు పొదిలి, ఒంగోలు, గిద్దలూరు, యర్రగొండపాలెం, దోర్నాల, మాచర్ల తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు మార్కాపురం బస్టాండ్‌కు చేరుకున్నారు. ఒంగోలు వెళ్లేందుకు మహిళలు బస్సు ఎక్కారు. బస్సులో సీటు సరే.. నిల్చునేందుకు కూడా స్థలం లేకపోవడంతో చేసేదేమిలేక బస్సు దిగిపోతున్నారు. మరికొన్ని ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు బస్టాండ్‌లో ఆగడంతోనే మహిళలు ఒక్కసారిగా కిక్కిరిసిపోతున్నారు. దీంతో సీటు దొరక్క పోవడంతో ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు.

గుర్తింపు కార్డులు లేకుంటే కష్టమే

పొదిలి: ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా మారింది కూటమి ప్రభుత్వం హడావుడిగా అమలు చేసిన స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం తీరు. అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉన్న తర్వాతే పథకం అమలు చేస్తే మేలు జరిగేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తింపు కార్డులు లేవనే సాకుతో కొంత మంది కండక్టర్లు ఉచిత ప్రయాణానికి అంగీకరించటం లేదని పలువురు మహిళలు ఆరోపించారు. పొదిలి డిపో పరిధిలో 81 సర్వీసులు ఉండగా వాటిలో 58 సర్వీసుల్లో పథకం కిందకు వస్తాయని అధికారులు చెబుతున్నారు. అన్ని గ్రామాలకు సంబంధించి స్టేజీలు లేకుంటే గ్రామీణ మహిళలకు ఏం ఉపయోగం అనే ప్రశ్నలు మహిళలు సంధిస్తున్నారు. బస్టాండ్‌లో శనివారం మహిళా ప్రయాణికులు అధికంగా కనిపించారు. బస్సుల్లో కూడా అన్ని సీట్లు వారితోనే నిండిపోవడంతో పురుష ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌లో ప్రయాణికులు ఎక్కిన తర్వాత బస్సు మొరాయించటంతో ఆర్టీసీ ఉద్యోగులు తాత్కాలిక మరమ్మతులకు పూనుకున్నారు. బస్సుల కోసం వేచి ఉన్నా అన్నీ ఫుల్‌గా ఉండటంతో పురుష ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు బస్సులో ప్రయాణించే సమయంలో వారి వద్ద గుర్తింపు కార్డు లేకున్నా తాత్కాలికంగా వారిని ఉచిత పథకంలో అనుమతించాల్సిందేనని ఉద్యోగులందరికీ సూచించినట్లు ఆర్‌ఎం సత్యనారాయణ చెప్పారు. శనివారం స్థానిక డిపోను ఆయన సందర్శించారు. ప్రయాణికులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. ఆర్‌ఎం సమక్షంలోనే పలువురు పథకం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఘాట్ రోడ్లలో కూడా పథకం అమల్లోకి ఉందన్నారు. ఆయన వెంట ఆర్టీసీ డీఎం శంకరరావు, సీఐ ధనలక్ష్మి పాల్గొన్నారు.

బస్సులే లేవు..ఉచితం ఎలా?

తర్లుపాడు: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నా తమకేం ప్రయోజనం లేదంటూ మండలంలోని మహిళలు పెదవి విరుస్తున్నారు. మండలంలోని మంగలకుంట, ఓబాయిపల్లి, కొండారెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లి, జగన్నాథపురం, తుమ్మలచెరువు, బుడ్డపల్లి, కేతగుడిపి, సూరేపల్లి, పోతలపాడు, గానుగపెంట తదితర గ్రామాలకు ఇప్పటికీ బస్ సౌకర్యం లేదు. ఉచిత బస్సు సౌకర్యం వినియోగించుకునేందుకు మహిళలు మార్కాపురం పట్టణానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని తర్లుపాడు మీదుగా కేవలం రెండు బస్సులు మాత్రమే తిరుగుతున్నాయి. సుమారు 10 గ్రామాల మహిళలు ఈ రెండు సర్వీసుల్లోనే ప్రయాణించాల్సి ఉంది. ప్రస్తుతం బస్సులు లేక సుమారు 16 గ్రామాల ప్రజలు ఆటోలు, సొంత వాహనాల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అన్నీ గ్రామాలకు బస్సులు నడిపినప్పుడే పథకంతో ప్రయోజనం తప్ప ఇప్పుడు తమకు ఒరిగేదేముందని మహిళలు చెబుతున్నారు.

> **గ్రామాలకు బస్సులు నడపాలి:**
> ఉచిత బస్సులు నడుపుతున్నామని ప్రభుత్వం చెబుతోంది. కానీ గ్రామాలకు బస్సులే లేనప్పుడు మేమెలా ఉచితంగా ప్రయాణించాలి. అన్నీ గ్రామాలకు బస్సులు నడిపి మహిళలు ఉచిత బస్సు పథకం వినియోగించుకునేలా చూడాలి. అరకొరగా బస్సులు నడిపి పథకం అమలు చేశామని గొప్పలు చెప్పుకోవడం కరెక్ట్ కాదు.
> — దిబ్బమ్మ, తర్లుపాడు

కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అలంకరణలో శ్రీకృష్ణుడు



గిద్దలూరులో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



కంభంలో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



బేస్తవారిపేట గీతామందిరంలో హోమాలు చేస్తున్న భక్తులు



బేస్తవారిపేట త్రిలోక పుణ్యక్షేత్రంలో కోలాట భజనలు

బేస్తవారిపేట: స్థానిక దరగకొండపై త్రిలోక పుణ్యక్షేత్రంలో, గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. అభిషేకాలు, 108 తులసీ దళాలతో అష్టోత్తర పూజా కార్యక్రమాలు, హోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. త్రిలోక పుణ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన కోలాట భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం, రాత్రికి అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గిద్దలూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామి మూలవిరాట్‌మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో సామూహికంగా దంపతులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం, కోలాటం, భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరవ గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు.

కంభం: మండలంలోని తురిమెళ్ల గ్రామంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు జయకృష్ణ నినాదాలతో, భగవద్గీత శ్లోక ఉచ్ఛరణలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకుడు చంద్రశేఖర ఆజాద్, సుభాషిణి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లి, కాకర్ల గ్రామాల దేవాలయాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పూలమాలలతో అలంకరించి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతర అంకభూపాలెంలో అన్న దానం చేశారు.

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని శ్రీకృష్ణ గోశాలలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతలకు పూజలు చేశారు. సామూహిక హోమాలు జరిపారు. బిట్స్ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ విజయలక్ష్మి శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి. అన్న సంతర్పణ, ఉట్టికొట్టుట, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు అప్పల శంకర్, ఆకుపాటి లక్ష్మణ పాల్గొన్నారు.

కొనకనమిట్ల: జయ కృష్ణా ముకుందా మురారి.. అంటూ కృష్ణాష్టమి పండగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అర్చకులు కృష్ణుడికి పూజా కార్యక్రమాలు, అర్చనలు చేశారు. మండలంలోని గొట్లగట్టులో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల గ్రామాల వీధుల్లో కృష్ణాష్టమి వేడుకలు, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ఇళ్లలో కృష్ణుడు విగ్రహాలు ఉంచి విశేష పూజలు చేశారు. చిన్నారులకు కృష్ణుడు, రాధ వేషధారణలు వేసి వారికి వెన్న ముద్దలు పెట్టి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.



గోపికల వేషధారణలతో యువతులు

చెన్నకేశవస్వామికి శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ఉభయ దేవేరులతో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టణంలోని కంభం రోడ్డులో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అరుణ్‌కుమార్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ఉభయ దేవేరులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసలు



ప్రశంసపత్రం అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి



ఏడీపీ బాలాజీనాయక్..

మార్కాపురం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసపత్రాలు దక్కాయి. ఇందులో భాగంగా మార్కాపురం ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి శుక్రవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టరైనే రాహుల్‌దేవ్ శర్మ ద్వారా ప్రశంసపత్రం అందుకున్నారు. మార్కాపురం ఏడీఏ బాలాజీ నాయక్ మంత్రి బాలవీరాంజనేయస్వామి ద్వారా ప్రశంసపత్రం అందుకున్నారు.

మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

అర్ధవీడు: మండలంలోని బొల్లుపల్లి, పాపినేనిపల్లి, అర్ధవీడు గ్రామాల్లో నాసిరకం కల్తీ విత్తనాలు గత ఏడాది అక్టోబర్‌లో సుమారు 40 మంది రైతులకు ఒక కంపెనీ ఆర్గనైజర్ ఇచ్చారని ప్రకాశం జిల్లా రైతు సంఘం నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న కండెలు ఎకరానికి 4 టన్నులు దిగుబడి వస్తాయని ఆర్గనైజర్ చెప్పడంతో రైతులు ఆశతో విత్తనాలు విత్తారన్నారు. పంట దిగుబడి రాకపోవడంతో రైతులు లారీని అడ్డుకోగా ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని నమ్మించిన ఆర్గనైజర్ మాటమార్చి మొండికేశాడని, రైతులకు ఆర్గనైజర్ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మార్కాపురం బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తున్నాం

- ఆర్టీసీ ఆర్‌ఎం సత్యనారాయణ



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సత్యనారాయణ

మార్కాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్‌ఎం బి.సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను డీఎం నరసింహులుతో కలిసి ఆయన పరిశీలించారు. మార్కాపురం డిపో పరిధిలో ఉన్న మరుగుదొడ్లను మహిళలకు, పురుషులకు అదనంగా నాలుగు చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. 11 లక్షల రూపాయలతో ప్రహరీ నిర్మిస్తున్నామని, మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూస్తున్నామన్నారు. ఒంగోలు, నంద్యాల, శ్రీశైలం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారని, ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్, ఓటరు కార్డు వంటి గుర్తింపు కార్డులు వెంట ఉంచుకోవాలని తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలు ప్రయాణం చేయవచ్చన్నారు.

వాజ్‌పేయ్‌కు ఘన నివాళి

మార్కాపురం: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి శనివారం పట్టణంలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయ్ దేశానికి తీసుకొచ్చిన సంస్కరణలు, సేవల గురించి వివరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, ఎ.సుబ్బారావు, అధ్యక్షుడు పి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, రాజు యాదవ్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న దాత రమణారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆవుల రమణారెడ్డి క్రీడా దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. దాత రమణారెడ్డికి పాఠశాల హెచ్‌ఎం బొల్లా పద్మావతి, పీఈటీ మోడి రాజశేఖర్, కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల భవనం పునఃప్రారంభం

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల శిథిలావస్థకు చేరి దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉన్న భవనాన్ని సర్పంచ్ పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించి పునఃప్రారంభించారు. గ్రామస్తులు, మాజీ, ప్రస్తుత పాఠశాల చైర్మన్‌లు, కౌన్సిలర్ కరీముల్లా తదితరులు సుమారు 3 లక్షల రూపాయలు వెచ్చించి భవనాన్ని వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌లు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకొని తల్లిదండ్రులకు, పాఠశాలలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com